క్లుప్తంగా

నిర్మాణం పిల్లర్లకే పరిమితం



వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం రెండేళ్ల కిందట మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.14 లక్షలతో చేపట్టిన భోజనశాల పిల్లర్లకే పరిమితమైంది. నిధులు లేక మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు వాపోతున్నారు. విద్యార్థులు వరండా, తరగతి గదుల్లో, చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్: సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. ఆదివారం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ ఏడాది పన్నుల లక్ష్యం రూ.2.23 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1.13 కోట్లు వసూలు కాగా సుమారు రూ.1.10 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, వేసవి సందర్భంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రతి ఊరిలో బడి, గుడి తప్పనిసరి



గట్టు: ప్రతి ఊరిలో బడి, గుడి తప్పనిసరిగా ఉండాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పిల్లలు బడికెళ్లి చదువుకుంటే జ్ఞానం లభిస్తుందని, పెద్దలు గుడికి వెళ్తే గ్రామాల్లో శాంతియుత నెలకొంటుందన్నారు. ఆదివారం ఇందువాసి గుట్టపై నూతనంగా నిర్మించిన ఇంజమ్మవ్వ దేవాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, స్టేట్‌కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయకుమార్, గద్దం కృష్ణారెడ్డి, బస్వరాజ్‌గౌడ్, వీరేష్ గౌడ్, రమేష్, వెంకటేష్, తిమ్మప్ప, మహబూబ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గ బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి రథోత్సవం



శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ సమీపంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు హోమాలు, బిల్వార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణ వేడుక జరిపించారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ఉత్సవం చేశారు. భక్తులు నందికోళ్లతో నృత్యాలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దారితప్పుతున్న గురువులు

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు నాయకులు, ఉపాధ్యాయ సంఘాల మద్దతు
- పంచాయితీ మంత్రి జూపల్లి వద్దకు..
- నివేదిక కలెక్టర్‌కు అందజేత



ఎంఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు (ఫైల్)

పాన్‌గల్: విద్యార్థినులను కన్న బిడ్డల వలే చూసుకుంటూ వారికి దిశా నిర్దేశం చేయాల్సిన ఉపాధ్యాయులు వృత్తికే మాయని మచ్చలా ప్రవర్తిస్తున్నారు. విద్యా బుద్ధులు నేర్పించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు.. కీచకులుగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల (కోఎడ్యుకేషన్)లో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఈ పాఠశాల వార్తలోకి ఎక్కింది. ఈనెల 6వ తేదీన పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థినులు కొందరూ ఉపాధ్యాయులు చేసే అసభ్యకర ప్రవర్తన, చెడు మాటల గురించి ఎంఈఓకు రాతపూర్వకంగా విన్నవించారు. దీంతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఆయా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈఓ, ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి పూర్తి నివేదిక అందజేయాలని ఉన్నతాధికారులు ఎంఈఓ శ్రీనివాసులును ఆదేశించారు. ఎంఈఓ ఆయా విద్యార్థుల నుంచి విడివిడిగా రాతపూర్వకంగా, వాయిస్ రికార్డింగ్ రూపంలో వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. ఇలాంటి ఘటనలతో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతారని పలువురు వాపోతున్నారు.

గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ..

విద్యార్థినులు ఫిర్యాదు చేసిన ఆయా ఉపాధ్యాయులు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో కూడా వారిపై ఇవే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇంత జరిగినా ఆయా ఉపాధాయుల్లో మార్పు రాకపోవడం దారుణం అని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఎంఈఓకు మంత్రి జూపల్లి ఫోన్..

పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటన వివరాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఎంఈఓకు ఫోన్ చేసి జరిగిన వివరాలపై ఆరా తీశారు. జరిగిన వివరాలు, విద్యార్థినులు వెలిబుచ్చిన అంశాలను ఎంఈఓ మంత్రికి వివరించినట్లు సమాచారం.

పంచాయితీ మంత్రి వద్దకు..

పాన్‌గల్ పాఠశాలల్లోని కొందరి ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణల పంచాయితీ మంత్రి జూపల్లి దృష్టికి వెళ్లింది. కొందరు అధికార పార్టీ నాయకులు, ఆయా సామాజిక వర్గం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శనివారం వీపనగండ్ల మండల పర్యటనలో ఉన్న మంత్రి జూపల్లి దృష్టికి తీసుకవెళ్లినట్లు సమాచారం. ఘటన వివరాలను ముందే తెలుసుకున్న మంత్రి.. తర్వాత మాట్లాడుతానని చెప్పి ఆయా నాయకులను పంపించినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆయా ఉపాధ్యాయులకు అధికార పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల మద్దతుగా నిలిచి పంచాయతీని మంత్రి వద్ద రాయబారం నడపటంపై తల్లిదండ్రులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఈఓకు నివేదిక అందించాం

పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులపై పూర్తి విచారణ చేసి విద్యార్థుల నుంచి సేకరించిన పూర్తి నివేదిక, ఒక్కొక్కరి అభిప్రాయాలను డీఈఓకు అందజేశాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

కలెక్టర్ దృష్టికి..



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో కొందరి ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఎంఈఓ అందజేసిన పూర్తి నివేదికను కలెక్టర్‌కు నివేదించాం. రెండో శనివారం, ఆదివారం వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఈ విషయంలో కొంత జాప్యం అయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ ఘనీ, డీఈఓ, వనపర్తి

‘కనీస సౌకర్యాలు కల్పించండి’



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

మదనాపురం: మండల ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలతో కలిసి సంత సాగే స్థలాన్ని, రైల్వేస్టేషన్, ఊకచెట్టు వాగు, మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. పూర్వం రెండో బొంబాయిగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం నేడు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి దుస్థితి ఉందని వాపోయారు. ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదని, ఈవిషయమై ఎన్నోసార్లు రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఏ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. మార్కెట్ యార్డు స్థలం కబ్జాకు గురైందని, సరిహద్దుకు వెంటనే కంచె ఏర్పాటు చేసి కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య యాదవ్, వీవీగౌడ్, మహేందర్ నాయుడు, గూడూషా, స్వప్న యాదవ్, నరేష్ లక్ష్మణ్, దేవర శివ, రమేష్ సాగర్, నాగరాజు యాదవ్, అక్కల మల్లేష్ గౌడ్, నాగరాజు, అ శ్రీనివాస్ గౌడ్, మ్యాదరి రాజు, చెలిమిల్ల రాములు గౌడ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన సంగనమోని రాముడు కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు ఆదివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. సంగనమోని రాముడు కోడేరు మండలంలోని మైలారం సమీపంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తుతో వలలో చిక్కుకొని మృత్యువాతపడిన విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వనపర్తి రూరల్: పట్టణంలో ఓ వ్యక్తి శనివారం నుంచి కనిపించడం లేదని కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆతయన కథనం మేరకు.. వనపర్తి పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన మద్ద రాజు శనివారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి ఆచూకీ కోసం బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో నరేష్ ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్

ఆత్మకూర్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఆత్మకూర్‌కు చెందిన బోరింగ్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అమరచింతలో మహిళలను సత్కరిస్తున్న వివేక్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

అమరచింత: మహిళలు ఆర్థికంగా, చదువుల్లో రాణించి తమ కుటుంబ ఎదుగుదలలో ముందుకు సాగాలని పలువురు మహిళా వక్తలు అన్నారు. వివేక్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, ఉపాధ్యాయురాలు శ్యామల మాట్లాడుతూ సమాజంలో మహిళలు మూఢనమ్మకాలు, భక్తి ముసుగులో చిక్కుకొని తమ పిల్లలను సైతం బలిచ్చే స్థాయికి దిగజారడం శోచనీయమన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై ప్రభుత్వం వేగంగా స్పందించాలని కోరారు. మహిళలు స్వశక్తితో సమాజంలో మగవారితో పోటీపడి రాణిస్తున్నారని, అయినప్పటికి దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాయత్నం, హింస, హత్యలు జరగడం బాధాకరమని వాపోయారు. అనంతరం వివేక్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ అక్కల నరసింహులుగౌడ్ మాట్లాడుతూ మహిళాదినోత్సవం రోజునే కాకుండా ప్రతి రోజు మహిళలను గౌరవించడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అబ్రహం, శంకరమ్మ, రేణుక, నాగేంద్రమ్మ, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు ఘనంగా సత్కరించారు.

ఆత్మకూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఇందుకు ప్రభుత్వాలు అవకాశం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలీల అన్నారు. ఆదివారం మున్సిపల్ కేంద్రంలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తరాలు మారుతున్న మహిళలపై అత్యాచారాలు, అణిచివేతలు, హత్యలు, కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యాపార, రాజకీయ, ఉద్యోగ తదితర రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐద్వా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా జరీనా, కార్యదర్శిగా మహేశ్వరి, సభ్యులుగా కాసింబీ, సమీరా, సల్మా, లక్ష్మి, శాంతమ్మ, ప్రమీల, రాఘవేంద్రమ్మ, పార్వతమ్మ, సుజాత, నూర్జహాన్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాలపై ప్రచారం



జగత్‌పల్లిలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కొత్తకోట, పెద్దమందడి, పెబ్బేరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి, కొత్తకోట మండలంలోని పామాపురం గ్రామాల్లో 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంద్రచారి, తిరుమలేష్, భాస్కర్ రెడ్డి, రవి, సుదర్శన్, ముజాఫర్, మల్లేష్, ఈశ్వర్, మహేష్, అనిత, శాంత, శైలజ, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు పాల్గొన్నారు.

దేపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

నవాబుపేట: మండలంలోని దేపల్లి గ్రామానికి 107 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దేపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీడీఓ జయరాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ దేవాలయ చైర్మన్ జగన్, రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు ఈనెల 15 లోపు బేస్‌మెంట్ పూర్తిచేస్తే వారికి మొదటి విడతలో రూ.లక్ష బిల్లు వస్తుందని డీఈ నర్సింహులు తెలపారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాడల్ విలేజ్‌గా చేసి 107 ఇళ్లను మంజూరు చేయించారని, అందరూ త్వరగా ఇళ్లు నిర్మించుకుంటే అందరికీ ఆదర్శంగా మారుతుందన్నారు. మండల కేంద్రంలో సబ్సిడీ ద్వారా బిందు సేద్యానికి సంబంధించిన పైపులను రైతులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న జనార్దన్

ఖిల్లాఘనపురం: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాచాల జనార్దన్ అన్నారు. ఆదివారం మండలంలోని శిశుమందిర్ పాఠశాలలో ఆచార్యులు, మాతాజీల మాసవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మండల విశ్వహిందూ పరిషత్ నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలో రోజురోజుకూ హిందూ జనాభా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. దేశ రక్షణ కోసం ప్రతి పౌరుడు ముందుండేలా పాఠశాలల్లో విద్యార్థులకు చిన్న వయసు నుంచే దిశానిర్దేశం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీను, సామలశ్రీను, సాక వేణు పాల్గొన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. దాదాపుగా 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు, గురువులు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత కుటుంబ నేపథ్యం, ఉద్యోగాలు, చేస్తున్న వ్యాపారాలపై చర్చించుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు కొండారెడ్డి, సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, గౌస్, ఉమాదేవి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభలో పుస్తకావిష్కరణ



డాక్టర్ బైరోజు శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవం సభలో వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ బైరోజు శ్యాంసుందర్ పరిశోధనా గ్రంథాన్ని మాజీ శాసనసభ సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభలు నిర్వహించారు. ఈనాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2015 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందిన డాక్టర్ శ్యాంసుందర్ సిద్ధాంత గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశ్వకర్మ సంస్కృతి సాంప్రదాయానికి సంబంధించి సాహిత్యం ఎంతో ఉందని, దానిపై మరిన్ని పరిశోధనలు జరగాలని మధుసూదనాచారి సాహితీవేత్తలను కోరారు. ఈనాటి కార్యక్రమంలో సభాపతి డా.త్రిమూర్తుల గౌరీశంకర్, లాలుకోట వెంకటాచారి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ శ్యాంసుందర్‌ను శాలువా పూలమాల జ్ఞాపికతో సత్కరించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ప్రతినిధులు జనజ్వాల, బండారు శ్రీనివాస్, నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

‘రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను కొనసాగిద్దాం’



చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: మిత, అతివాదులకు వ్యతిరేకంగా పోరాడిన రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను నేటి తరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రాజన్న, ప్రసాద్, హన్మంతు అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేంద్ర కమిటీ నాయకుడిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సామేలు, ప్రేమరత్నం, భక్తి, కురుమన్న, జిలాని, మస్తామని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు తక్షణమే అమలు చేయాలి



శాంతినగర్‌లో ధర్నా చేస్తున్న రైతాంగ సమితి నాయకులు

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేయం) జాతీయ కమిటీ పిలుపుమేరకు వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ చట్టం, రుణ విముక్తితోపాటు రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. నూతన జాతీయ మార్కెటింగ్ ముసాయిదాను రద్దు చేయాలన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. విద్యుత్ సవరణ బిల్లును రైతు సంఘాలతో చర్చించకుండా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టమని రాతపూర్వకంగా హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల్లో కోత విధించారని ఆరోపించారు. గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, జూరాల ప్రాజెక్టులో పూడిక తీయాలని, ఆర్డీఎస్ ఆధునికీకరణ చేపట్టి 15.9 టీఎంసీలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుని చివరి ఆయకట్టు వరకు సాగునిరందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజికి కార్యకర్త గోపాల్‌రెడ్డి, తెలంగాణ జన సమితి అలంపూర్ ఇన్‌చార్జి వై.రామ్మోహన్, లింగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, తిక్కన్న, గోపాల్ పక్కీరన్న, సుదర్శన్, హలీబాబు, రైతులు పాల్గొన్నారు.

జలం.. తగ్గుముఖం

- పరమేశ్వరస్వామి చెరువులో తగ్గిన నీటిమట్టం
- అధికారులు స్పందించాలని వినతి



చెరువులో తగ్గిన నీటిమట్టం



తెరుచుకొని ఉన్న తూము

ఆత్మకూర్: వేసవి రాకముందే పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువు అడుగంటుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా చెప్పాపెట్టకుండా చెరువులోని నీటిని వృథాగా కిందికి వదులుతుండడంతో చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో పది వార్డుల్లో సుమారు 20 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఐదు వేలకుపైగా నివాసగృహాలు ఉండగా.. దాదాపు వెయ్యికిపైగా నివాసాల్లో బోర్లు ఉన్నాయి. ఆ బోర్ల సాయంతోనే పట్టణ ప్రజలు నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. చెరువు ఖాళీ అయితే ఆత్మకూర్‌లో తాగు నీటి కష్టాలతో అల్లాడిపోవాల్సిన పరిస్థితి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా నీటి తరలింపు

పరమేశ్వరస్వామి చెరువు కింద పంటలు పండించేందుకు అంటూ కొందరు సాగునీటిని అక్రమ పద్ధతిలో తరలిస్తున్నారని అధికారులు అంటున్నారు. వదుతున్నది రైతులా.. ఇతరులు ఎవరైనా అన్న విషయాన్ని మాత్రం అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని, ఎవరి ప్రయోజనాల కోసం నీటిని వదిసి చెరువును ఖాళీ చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలోనే తాగునీటి కష్టాలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నయంటూ స్థానికులు వాపోతున్నారు. జూరాల అధికారులు సైతం క్రాప్‌హాలిడే ప్రకటించిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువునీటి విడుదలను నిలిపి వేయాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేయిస్తాం

పరమేశ్వరస్వామి చెరువులో జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కొద్దిపాటి నీటిని వదిలేశామని తహసీల్దార్ చాంద్‌పాషా, ఇరిగేషన్ ఏఈ కిషోర్‌కుమార్ అన్నారు. అనుమతులు లేకుండానే కొంత మంది గేట్‌వాళ్లకు సంబంధించిన పరికరాలను సైతం వారి వద్దనే ఉంచకొని ఇష్టమొచ్చినట్లు నీటిని వదులుకుంటున్నట్లు తెలిసిందన్నారు. అక్రమంగా నీళ్లను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.